

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

చిత్తూరు తిరుపతి

సోమవారం 23 జూన్ 2025




## ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న
# ఆహార కల్తీ






- తినే ఆహారమంతా కల్తీయేనా
- కల్తీకి కేరాఫ్ హెూటల్స్
- బయట కలర్ ఫుల్ ప్యాకింగ్‌లు.. లోపలి తినుబండారాలకు కల్తీ కోటింగ్
- కల్తీ ఫుడ్స్‌కు తప్పుతున్న నియంత్రణ...
- యథేచ్ఛగా రంగులు మిళితం.. ఆరోగ్యానికి హాని
- కాలం చెల్లిన తినుబండరాలు విక్రయం..
- వినియోగదారులను మోసం చేస్తున్న వైనం..
- ఫుడ్ లైసెన్స్ లేకుండానే అమ్మకాలు..
- మొక్కుబడి తనిఖీలతో నెట్టుకొస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

మీరు హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు వెళ్లి నోరు ఊరించే ఆహార పదార్థాలను ఆరగిస్తున్నారా... వేడిగా కారం కారంగా ఉండే బజ్జీలు, ఘాటుగా వాసన వస్తున్న నూడిల్స్, ఫ్రైడ్‌రైస్, సమోసాలు ఇష్టంగా తింటున్నారా.. రుచిగా, చూడడానికి ఆకర్షణీయంగా కనిపిస్తున్న వివిధ రకాల ఫుడ్స్ తరచూ వాడుతున్నారా.. అయితే ఒక్కసారి ఆలోచించండి. ఆహార పదార్థాలు రుచి ఎక్కువగా ఉండడం కోసం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నారని ఎప్పుడైనా గమనించారా. మీ ఆరోగ్యాలను నాశనం చేస్తున్నాయని ఏనాడైనా ఆలోచించారా... దాదాపు 90 శాతం దుకాణాల్లో కల్తీ, నాసిరకం ఆయిల్ వినియోగించడమే కాక రుచి, సుచి కోసం కెమికల్స్ విరివిగా వాడుతున్నారని వివిధ పరిశీలనలో వెల్లడవుతోంది. మనిషి జీవించాలంటే ఆహారం, నీళ్లు అతి ముఖ్యం. తినేది కూడా కల్తీ లేని.. శుభ్రమైన ఆహారం అయ్యుండాలి. ఇంట్లో వండుకోవడం కంటే బయట దొరికేది తినడానికే జనం ఇష్టపడుతున్న ప్రస్తుత రోజుల్లో.. అనారోగ్యం బారిన పడేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండకపోతే ప్రమాదం తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కలుషిత ఆహారం ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. కాలం చెల్లిన తినుబండారాలు, స్వీట్లు, బేకరీ పదార్థాలు తిని చాలామంది అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. పాడైన ఆహార పదార్థాలు తినడం వల్ల, విరేచనాలు, వాంతులు, గ్యాస్ట్రిక్, ఉదర సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. కరోనా నేపథ్యంలో ప్రజలు కొంతకాలం ఇంటి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల, ప్యాకేజ్డ్ తినుబండారాలు, బేకరీ

మిగతా 8లో

## ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసమే
# కార్డెన్ సెర్చ్ : సీఐ

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** ప్రజల భద్రత,నేరాల నియంత్రణ కోసమే నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు, ప్రజారక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని నాయుడుపేట అర్బన్ సీఐ బాబి అన్నారు. ఆదివారం నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో ఎస్పీ డీఎస్పీ చెంచుబాబు ఆదేశాల మేరకు అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అర్బన్ సీఐ బాబి ముగ్గురు ఎస్సైలు, సిబ్బందితో ఉదయం నుంచి కార్డెన్ సెర్చ్ తనిఖీలు చేశారు. పోలీసులు సోదాలు నిర్వహించి సరైన పత్రాలు లేని పలువాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట అర్బన్ సీఐ బాబి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, ఆర్‌సీ పత్రాలను కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను రక్షిస్తుందన్నారు. వాహనాలపై జరిమానాలు ఉన్నట్లయితే ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. ప్రజల రక్షణార్థమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు నేరాల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి ప్రశాంత జీవితం గడపాలన్నారు. యువత మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, కాలనీలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసుల సమాచారం ఇవ్వాలన్నారు. యువత సత్ప్రవర్తన కలిగి మంచి పౌరులుగా ఎదగాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ ప్రజల రక్షణ కోసమే పోలీసులు అన్నివేళలా పాటుపడతారన్నారు. నేర రహిత సమాజం, ప్రజా శ్రేయస్సు కోసం ప్రజలు, యువత పోలీసులకు సహకరించాలని సీఐ బాబి కోరారు.స్థానికంగా ఏలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎస్సైబ్రహ్మనాయుడు, శ్రీహరికోట ఎస్సై శ్రీకాంత్, నాయుడుపేట అర్బన్ ఎస్ఐ దారం ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






# విద్యానగర్‌లో ఎన్‌సీసీ శిక్షణా శిబిరం



**కోట, మేజర్‌న్యూస్:** కోట మండలం విద్యానగర్‌లోని బాలకృష్ణారెడ్డి కళాశాలలో జరుగుతున్న వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం సమన్వయంతో కూడిన కార్యకలాపాల శ్రేణి క్యాంపు కమాండెంట్ గణేష్ గోడమ్గావే అద్వర్యంలో నిర్వహించారు. పర్మినెంట్ ఇన్స్ట్రక్టర్లు, అసోసియేట్ ఆఫీసర్లు సమర్థవంతంగా నాయకత్వం వహించిన ఉదయం శారీరక శిక్షణ సెషన్తో రోజు ప్రారంభమైంది. ఈ సెషన్లో క్యాడెట్ల నుండి ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది. దీని తర్వాత, కమాండింగ్ ఆఫీసర్ ఆల్ ఇండియా నౌ సైనిక్ క్యాంప్ కోసం తయారీపై దృష్టి సారించి, ఇంటర్-గ్రూప్ పోటీ బృందం కోసం ప్రత్యేక శిక్షణా సెషన్ను నిర్వహించారు. క్యాడెట్లు ఆసక్తిని కనబరిచారు. అధునాతన శిక్షణా పద్ధతులు, పోటీ సంసిద్ధతపై విలువైన అంతర్దృష్టులను పొందారు.

**పడవ లాగడం:-** సమాజ తిమింగల పడవలలో జట్లు పోటీపడతాయి, సమన్వయం, బలం, సాంకేతికతను ప్రదర్శిస్తాయి.

**సెమాఫోర్:-** నావికా విధానాల ప్రకారం జెండా సంకేతాలను ఉపయోగించి కమ్యూనికేషన్. సందేశ ప్రసారంలో ఖచ్చితత్వం, సమయం, స్పష్టతను పరీక్షిస్తుంది.



**షిప్ మోడలింగ్:-** క్యాడెట్లు ఓడ నమూనాలను రూపొందించాయి. సృజనాత్మకత, ఖచ్చితత్వం, ప్రదర్శన ఆధారంగా నిర్ణయించబడతాయి.

**నావల్ క్విజ్:-** నావికా జ్ఞానం, సముద్ర చరిత్ర మరియు ప్రస్తుత వ్యవహారాలపై వ్రాతపూర్వక లేదా మౌఖిక క్విజ్.

**నావిగేషన్:-** చార్ట్ పని, దిక్సూచి వాడకం, సముద్ర నావిగేషన్ నియమాల అవగాహనను కలిగి ఉంటుంది.

**సీమాన్షిప్:-** నాట్ టైయింగ్, రిగ్గింగ్, యాంకరింగ్ మరియు ఇతర ప్రాథమిక నావికా నైపుణ్యాలను కలిగి ఉంటుంది.

**ఫైరింగ్:-** ఒత్తిడిలో ఖచ్చితత్వం, ప్రశాంతతను పరీక్షించడానికి రైఫిల్ షూటింగ్.

**డ్రిల్ (ఆయుధాలతో):-** రైఫిల్స్తో క్లోజ్-ఆర్డర్ మిలిటరీ డ్రిల్, ఖచ్చితత్వం, సమన్వయంపై అంచనా వేయబడుతుంది.

**సాంస్కృతిక పోటీ:-** ప్రాంతీయ సంస్కృతిని సూచించే నృత్యం, స్కిట్, సంగీతం లేదా జానపద కళా ప్రదర్శనలు.

**ఆరోగ్యం, పరిశుభ్రత / యోగా:-** ఆరోగ్యం, క్రమశిక్షణకు సంబంధించిన ప్రదర్శన లేదా పోటీ.

**ఉత్తమ క్యాడెట్ పోటీ:-** అన్ని స్థాయి పనితీరు ఆధారంగా ఎంపిక, విద్యావేత్తలు, శారీరక దృఢత్వం, నావికా నైపుణ్యాలు, వ్యక్తిత్వం, ఇంటర్వ్యూ. మధ్యాహ్నం, జనరల్ సబ్జెక్టుల తరగతులను,పెంచల రెడ్డి, ఆఫీసర్ నిర్వహించారు, సంబంధిత విషయాలపై క్యాడెట్ల జ్ఞానం, అవగాహనను పెంపొందించడానికి కీలక అంశాలను కవర్ చేశారు. సాయంత్రం సెషన్లో, కళాశాలలోని విశాలమైన క్రీడా సముదాయంలో క్యాడెట్లు. ఫుట్బాల్, వాలీబాల్ , క్రికెట్, ఖో-ఖో వంటి ఆటలలో చురుకుగా పాల్గొన్నారు .సాయంత్రం తరువాత, రాబోయే ఇంటర్-కంపెనీ, ఇంటర్-గ్రూప్ సాంస్కృతిక పోటీలకు క్యాడెట్లను సిద్ధం చేయడం లక్ష్యంగా సాంస్కృతిక అభ్యాస సెషన్లు ప్రారంభమయ్యాయి. క్యాడెట్లు అపారమైన ప్రతిభ మరియు ఉత్సాహాన్ని ప్రదర్శించారు. క్యాడెట్లలో క్రమశిక్షణ, ప్రతిభ, నాయకత్వాన్ని పెంపొందించడంలో యన్ సీసీ బృందం యొక్క అంకితభావాన్ని, క్యాడెట్ల యొక్క ఉత్సాహభరితమైన స్ఫూర్తిని ఈ రోజు కార్యక్రమాలు ప్రతిబింబించాయి.

## టీటీడీకి ఏసీ బస్సు విరాళం

**తిరుమల మేజర్‌న్యూస్:** ప్రఖ్యాత ఆటో మొబైల్ కంపెనీ, అశోక్



లేలాండ్ టిటిడికి ఒక 41-సీటర్ ఏసి బస్సును ఆదివారం నాడు విరాళంగా అందించింది. సుమారు రూ.35 లక్షల విలువైన ఈ బస్సును అశోక్ లేలాండ్ ఎం అండ్ హెచ్‌సీవీ అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు టిటిడికి అందజేశారు. సాధారణంగా ప్రతి ఏడాది అశోక్ లేలాండ్ కంపెనీ వారు టిటిడికి ఒక ఆటోమొబైల్ వాహనాన్ని విరాళంగా అందిస్తుంది.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, తిరుమల డిపో డిఐ వెంకటాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సిహెచ్ శ్రీనివాసులు రాయుడుకు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధం లేదు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:**

శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇంచార్జ్ కోట వినుత చంద్రబాబు దగ్గర నమ్మకంగా వ్యక్తిగత సహాయకునిగా, డ్రైవర్ గా పనిచేసిన బొక్క సంపాలెం గ్రామానికి చెందిన సిహెచ్ శ్రీనివాసులు రాయుడు అని పిలవబడే వ్యక్తి అనుచితమైన, అభ్యంతరకరమైన, కుట్ర పూరితమైన, మా రాజకీయ ప్రత్యర్థులు ప్రలోభాలకు లొంగి, మాకు ఎన్నో రకాలుగా ప్రాణ, గౌరవ అంశాలలో భంగం కలగ చేసినందున ,మ అతనిని మా దగ్గర పనిలో నుంచి 21, జూన్, 2025 నుంచి తొలగించటం జరిగింది. అతనికి మాకు ఎటువంటి సంబంధం లేదని శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇంచార్జ్ కోట వినుత చంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ప్రజలు విస్తృత ప్రయోజనాలు రీత్యా తెలియచేస్తున్న ప్రకటన. కావున అందరూ గమనించ గలరు అని తెలిపారు.

## ఘనంగా ఎంపీ గురుమూర్తి జన్మదిన వేడుకలు

**శ్రీకాళహస్తి రూరల్ మేజర్ న్యూస్:**

ఎర్రగుడిపాడు గ్రామంలో మద్దిల గురుమూర్తి జన్మదిన సందర్భంగా ఎంపీ గురుమూర్తి చిత్రపటానికి పాలాభిషేకం చేసి బర్త్డే విషెస్ చెప్పిన ఎర్రగుడిపాడు యూత్ వైసీపీకి ఉన్న నలుగురు ఎంపీల్లో ఒకే ఒక్కరు ప్రజానాయకుడిగా నిలిచారు. ప్రజాభిమానం చూరగొన్నారు. 'మా మంచి ఎంపీ'ల జాబితాలోనూగత ఏడాది వైసీపీ తుడిచి పెట్టుకు పోయినా. ముఖ్యంగా బలమైన టీడీపీ కంచుకోటగా ఉన్న చిత్తూరులో ఎంపీ గురుమూర్తి విజయం దక్కించుకున్నారు.తిరుపతి పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే.. వాటిలో ఒక్కటి కూడా వైసీపీకి దక్కలేదు.కానీ, ఎంపీగా మాత్రం గురుమూర్తి విజయం దక్కించుకున్నారు. తాజాగా వెల్లడించిన పలు సర్వే సంస్థల జాబితాలలో మంచి ఎంపీగా, ప్రజల సమస్యలను పట్టించుకునే ఎంపీగా, ప్రజలకు చేరువగా ఉండే ఎంపీగా గురుమూర్తి పేరు తెచ్చుకోవడం గమనార్హం ఆయన పేరు ప్రఖ్యాతలు సంపాయించుకున్నారు. ఆయనే తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి. 2021లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఫిజియోథెరపిస్టు గురుమూర్తి. జగన్ పాదయాత్ర చేసినప్పుడు ఆయనకు వ్యక్తిగత వైద్యుడిగా ఉన్నారు. ఈ క్రమంలోనే 2021లో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలలో పోటీ చేసి విజయందక్కించుకున్నారు. సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు.



# ఘనంగా ఎంపీ గురుమూర్తి జన్మదిన వేడుకలు

**కేవీబీపురం, మేజర్‌న్యూస్:** తిరుపతి ఎంపీ డా. మద్దిల గురుమూర్తి జన్మదిన వేడుకలను కేవీబీపురం మండల కేంద్రంలోని డాక్టర్ వైయస్ఆర్ బొమ్మ వద్ద ఘణంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బానాసంఛా కాల్చి పెద్ద ఎత్తున సంభరాలు చేసుకున్నారు. అనంతరం పలు ప్రభుత్వ పాఠశాల వద్ద మొక్కలు నాటడంతో పాటు, మొక్కలను పంపినీ చేసారు. గవర్ల కృష్ణయ్య మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో రెండు సార్లు ఎంపీగా గెలిచి గురుమూర్తి రాష్ట్ర రాజకీయాల్లో తనవైన ముద్ర వేసుకున్నారని అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వి నియోగం చేసుకుని, ఓట్లు వేసిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషిచేస్తున్నారని అన్నారు. అంతే కాకుండా రాష్ట్ర నలుమూలలా జరుగుతున్న సమస్యలపై ఎప్పటి కప్పుడు స్పందిస్తూ పార్టీకి బలంచేకూర్చుడంతో పాటు, నాయకులు కార్యకర్తలకు అండగా ఉండడం గొప్ప విషయమన్నారు.



గురుమూర్తి దీర్ఘాయుష్షతో ప్రజాసేవలో కొనసాగాలని కోరుతున్నట్లు ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు మణి, సీనియర్ నాయకులు ధశరధరామిరెడ్డి, బాల సుబ్రమణ్యం, సర్పంచుల సంఘం అద్యక్షుడు రామ్మోహన్ వర్మ, కేవీబీపురం ఉప అధ్యక్షులు మరియు సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ అయ్యప్ప, యువ నాయకులు మణి, కార్యకర్తలు హరి, మురళీ,రాజ, సాల్మాన్, ఉస్మాన్ బాషా, ప్రకాష్, ప్రవీణ్, విజయ్ పాల్గొన్నారు.

## ఆర్కే నాయుడు కర్మక్రియలకు హాజరైన ఎమ్మెల్యే పులివర్తి

### ఆర్కే నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

**రామచంద్రాపురం, మేజర్‌న్యూస్:** మండలంలోని కమ్మకండ్రిగమిట్ట గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ప్రసాద్ పెద్దనాన్న ఆర్కే నాయుడు కర్మక్రియలకు హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నాని ఆర్కే నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఎమ్మెల్యే పులివర్తి నాని ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి చిన్న బాబు, మాజీ ఎంపీపీ కేశవులు నాయుడు,నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, సురేంద్ర నాయుడు, ముని రామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, సునీల్ యాదవ్, ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బదిలీలను పారదర్శకంగా నిర్వహించిన విద్యాశాఖ

### ఉపాధ్యాయ బదిలీలలో సంఘాల సూచనలు తీసుకున్న మంత్రినారా లోకేష్
### మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే పులివర్తి నానికి ధన్యవాదాలు తెలిపిన ఉపాధ్యాయులు

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ విజయవంతంగా చేసినటువంటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు చంద్రగిరి నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేశారు. ఆదివారం చంద్రగిరి నియోజకవర్గంలోని ఉపాధ్యాయ సంఘుల నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జగదీష్, సురేష్‌లు సంయుక్తముగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది ఉపాధ్యాయులు కోరుకున్న స్థానాలకి బదిలీపై వెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన అన్ని విషయాలని ఉపాధ్యాయ సంఘాలతో పలుమార్లు చర్చించి బదిలీల ప్రక్రియని పారదర్శకంగా విజయవంతంగా పూర్తిచేయడం అభినందినీయమన్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కొన్నిఅంశాల్ని సంక్రాంతి పండుగకి నారావారి పల్లికి వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని చొరవతో తెలియజేశామన్నారు. ఆ సూచనలను (అంశాలను) పరిగణలోకి తీసుకొని ఉపాధ్యాయుల బదిలీల జీవో జారీ చేసి, పారదర్శకంగా బదిలీల ప్రక్రియ పూర్తి చేసినందుకు ఉపాధ్యాయులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు జగదీష్, హరికృష్ణ, రామిరెడ్డి, నాధముని, రూపకుమార్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, టి.పి. నాగరాజ్ పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంతో వ్యాధుల నివారణపై శిక్షణ

**చిల్లకూరు మేజర్‌న్యూస్:** మండలంలోని తమినపట్నం గ్రామంలో కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రకృతి వ్యవసాయ సిద్ధాంతకర్త సుభాష్ పాలేకర్ మార్గదర్శకాల మేరకు "ప్రకృతి వ్యవసాయంతో వ్యాధుల నివారించే కిట్" పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమం అదానీ కృష్ణపట్నం పోర్ట్ మరియు అదానీ ఫౌండేషన్ సంస్థల సహకారంతో, వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల భాగంగాకృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో "నేచురల్ ఆర్గానిక్ బెస్ట్ డిసీజ్ రీప్లాంట్ కిట్" శిక్షణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. రైతులలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచడం, సేంద్రియ దిశగా సాగు పద్ధతుల ప్రాధాన్యతను వివరించడం ప్రధాన ఉద్దేశ్యంగా కొనసాగిన ఈ కార్యక్రమంలో, భాగస్వాములచే రైతులకు ప్రాక్టికల్ ట్రైనింగ్, డెమో ప్రదర్శనలు అందించబడ్డాయి.కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ నుండి సి.ఈ ఓ అయిన సి.హెచ్. వెంకటేశ్వర్లు, ట్రెజరర్ మరియు డైరెక్టర్, ఎస్.కె షఫీ, మీడియా, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ నాశిన సాయినాథ్ పాల్గొనగా, అదానీ ఫౌండేషన్ నుండి రాజేష్ రంజన్–హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్, శేఖ్ షాహుల్ అహ్మద్–అగ్రికల్చర్ ఆఫీసర్ పాల్గొన్నారు.ఈ శిక్షణలో పాల్గొన్న రైతులకు "నేచురల్ ఆర్గానిక్ బెస్ట్ డిసీజ్ రీప్లాంట్ కిట్" వాడకంపై సమగ్రమైన అవగాహన కల్పించడంతో పాటు, దాని ప్రయోజనాలు, ఉపయోగాలు, భవిష్యత్ సాగుపై దాని ప్రభావం మొదలైన అంశాలపై సజీవ డెమో ద్వారా స్పష్టతనిచ్చారు.ఈ కార్యక్రమం గ్రామీణ వ్యవసాయంలో పచ్చదనం వైపు వేగంగా దూసుకెళ్లే మార్గంలో మరొక పటిష్టమైన అడుగు అని నిర్వాహకులు తెలిపారు.



## వ్యవసాయం దండగన్న చంద్రబాబు రైతులకు ఏం మేలుచేస్తాడు

### కోట్లల్లో చిత్తూరు జిల్లాలో టమోటా రైతులు నష్టపోయారు
### తోతపురి కిలో రూ.2, రూ.3లు ధరలు ఉంటే రైతులు ఎలా బతకాలి
### సీఎంపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫైర్



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలలో మాజీమంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పాల్గొన్నారు. పుంగనూరులో పాల్గొన్న కార్యక్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయం చేయడం దండగ అన్న చంద్రబాబు నాయుడు ఇక రైతులకు ఏం మేలుచేస్తారన్నారు. రైతు భరోసా కేంద్రాలు మూత పడ్డాయి. రైతులకు ఎక్కడ కూడా పంట గిట్టుబాటు ధర ఇచ్చే పరిస్థితులు లేదు రాష్ట్ర వ్యాప్తంగా మనం చూస్తున్నాం గతంలో వరి రైతులు మిర్చి రైతులు పత్తి రైతులు పొగాకు చెరుకు రైతులు గిట్టుబాటు ధర లేక నష్టపోయారన్నారు. ఇప్పుడు చిత్తూరు జిల్లాలోని కోట్ల మంది రైతులు టమోటా సాగు చేసి నష్టపోయారు. ఈరోజు పరిస్థితి చూస్తే మామిడి పంటకు గిట్టుబాటు లేదు. తోతాపూరి కొనే పరిస్థితి లేదు కిలో రెండు మూడు రూపాయల అమ్మే పరిస్థితి నెలకొంది గిట్టుబాటు ధర రూ. 8లు ఇమ్మని చెప్పి చెప్పామని ఫ్యాక్టరీలకు రూ. 4లు సబ్సిడీ ఇస్తుందన్నారు. కానీ మామిడి రైతులకు కిలో రెండు మూడు రూపాయలు ఇస్తున్నారు. ఇవన్నీ కూడా బూటకపు మాటలు చంద్ర బాబు నాయుడు మాట్లాడుతున్నారన్నారు. రైతులను వారు ఎప్పుడు పట్టించుకున్న దాఖలాలు లేవని ఇలాంటి ముఖ్యమంత్రి ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తుంటే రైతులకు ఏ విధంగా గిట్టుబాటు ధరలు దొరుకుతాయి రైతులు ఏ విధంగా వ్యవసాయం చేస్తారు ఇది చాలా బాధాకరమని మన రాష్ట్రంలో ప్రజలు 75% వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నారు. మనకు కావలసిన భూములు ఉన్నాయి వాటిని అన్నీ కూడా మనం సాగుచేయడానికి ప్రభుత్వం చేదోడుగా నిలుస్తుందనుకుంటే ఈరోజు అందరినీ ఉసురు మనిపిస్తున్నారన్నారు. రైతులను పలకరిం చడానికి యాత్ర చేస్తుంటే జగన్మోహన్ రెడ్డిని అడ్డుకుంటూ రకరకాల కేసులను పెడుతున్నారని కార్యకర్తలను బెదిరిస్తున్నారని ఇవన్నీ చేయ వలసిన అవసరం ఏముంది మీరు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వండి గతంలో టమోటాకు గిట్టుబాటు ధర లేనప్పుడు టమోటాకు ప్రభుత్వ మే కొని గిట్టుబాటు ధర ఇచ్చింది ఇప్పుడు ఏ పంటకు గిట్టుబాటు ధర లేదు గతంలో మనం చూసాం రైతులందరూ క్రాప్ హాలిడే అని పెట్టారు ఇప్పుడు కూడా రైతులందరూ సెలవుల్లో ఉండవలసిందే ఈ సెలవులు నాలుగు సంవత్సరాలు కంటిన్యూ కావాల్సిందే తప్ప రైతులకు మనం చేయూతనిద్దాం అనే ప్రభుత్వం కాదు అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డప్ప, మున్సిపల్ చైర్మన్ అలీ భాష, మండల ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, కొండవీటి నాగభూషణం, అమ్ము చెంగారెడ్డి రాజేష్, హేమంత్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారం

**పలమనేరు, మేజర్‌న్యూస్:** ప్రముఖ ప్రాఫిట్ షూ కంపెనీ ఆధ్వర్యంలో మండలస్థాయి పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆదివారం పలమనేరులోని ప్రాఫిట్ షూమార్ట్‌లో పలమనేరు సిఐ నరసింహారాజు, ఎస్ఐ లోకేష్ రెడ్డి సన్మానించి మోమెంటోలు అందజేశారు. పెద్దపంజాణి మండలం శంకర్రాయలపేటలోని ప్రభుత్వ కస్తూరిబా ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన కనబరిచిన మల్‌రెడ్డి గారి సుమశ్రీ, పలమనేరు ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన రూకేష్ యాదవ్ ఇరువురినీ ఘనంగా సన్మానించి మోమెంటోలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రాఫిట్ షూ కంపెనీ ఏరియా మేనేజర్ మనోహర్, స్థానిక మేనేజర్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.





## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి

### ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

**నగరి, మేజర్‌న్యూస్:** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకుని సిఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పంపిణీ చేశారు. నగరి మున్సిపాలిటీ కొత్తపేటకు చెందిన ఎం.పి.జ్యోతి రూ. 1,00,457లు, ఏకాంబరకుప్పం వేణుకు రూ. 75,915లు, టి.ఎం.అరుణ్‌కు 17,500లు, ఎస్‌టి కార్పగన్‌కు రూ. 29,084లు, నెత్తం కండ్రిగకు చెందిన పి.వాసుకు రూ. 35,000, టిఆర్.కండ్రిగకు చెందిన ఎం.విజయకు రూ. 21,441, కరకంతాపురంకు చెందిన ఎం.తేజశ్రీకు రూ. 35,255లు చెక్కులు ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు.




## 40 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** స్థానిక సరోజినీదేవి రోడ్డులోని నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో 1981–1987 మధ్య ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు చదివిన విద్యార్థులందరూ 40సంవత్సరాల అనంతరం ఆదివారం వారంతా ఒకచోట కలిశారు. ఆత్మీయంగా ఒకరికొకరు పలకరించుకున్నారు. 1987 తర్వాత వారందరూ మొదటి సారిగా స్థానిక ఓ ప్రైవేటు హొటల్లో సరదాగా అందరూ కలిసి భోజనాలు చేశారు. ఒకరికొకరు ఆత్మీయంగా పరిచయాలు చేసుకున్నారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు తమకు విద్య నేర్పిన విధానాన్ని, భయభక్తులతో మెలగాలని చెప్పిన సూచనలు తమను నేడు జీవితంలో ఉన్నతంగా నిలిపాయంటూ ఆనందించారు. గత చిన్ననాటి స్మృతుల జ్ఞాపకాలతో ఒకరికొకరు తెలియజేసుకుంటూ, తాము వివిధ ప్రాంతాల్లో ఏ ఏ వృత్తుల్లో స్థిరపడ్డారో తెలియజేసుకున్నారు. ఆ పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాలకు, అందులో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల కోసం తమ శక్త్యానుసారం ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు.





## పవన్ కళ్యాణ్‌కు స్వాగతం పలికిన ఆరణి మదన్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తమిళనాడు రాష్ట్రం మదురైలో హిందూ మున్నానీ సంస్థ నిర్వహించిన మురుగన్ భక్తుల మహానాడులో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం విమానాశ్రయంకు చేరుకున్న జనసేన చీఫ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి స్వాగతం పలికిన ఆరణి మదన్. తిరుపతి నుంచి సభలో పాల్గొనేందుకు వంద మందికి పైగా కార్యకర్తులు వచ్చినట్లు పవన్ కళ్యాణ్ కు తెలిపారు ఆరణి మదన్. సభ అనంతరం అందురూ స్వస్థలాలకు చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని మదన్‌కు సూచించిన పవన్ కళ్యాణ్.

## బ్రాహ్మణ కాలువ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

### - ఎమ్మెల్యే పులివర్తి నాని

**రామచంద్రపురం మేజర్‌న్యూస్ :** బ్రాహ్మణ కలువ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం ఆయన బ్రాహ్మణ కాలువను పరిశీలించారు. వరద నీరు గ్రామంలోకి రాకుండా కాలువను మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు సమన్వయంతో సర్వే చేసి పనులు ప్రారంభించాలన్నారు. గ్రామ అభివృద్ధికి సుమారు 35 లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి చినబాబు,జనార్దన్ చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, సురేంద్ర నాయుడు, ముని రామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, సునీల్ యాదవ్, ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సచివాలయ ఉద్యోగుల బదిలీలలో 'స్థానిక నిబంధన'ను తొలగించాలి

**పలమనేరు మేజర్ న్యూస్::** పలమనేరు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో "మండలాన్ని యూనిట్‌గా తీసుకుని అదే మండలంలో పని చేయకుండా చేసిన నిబంధన"ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ ఎన్జీజీవో సంఘం పలమనేరు తాలూకా అధ్యక్షుడు ఆనంద బాబు, కార్యదర్శి జయమ్మ డిమాండ్ చేశారు. ఈ నిబంధన కారణంగా పలువురు చిరుద్యోగులు, మరీ ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వారు సుదూర ప్రాంతాలకు బదిలీ అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ విభాగం ఉద్యోగులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న వేళ ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు రమణ, సంఘ నాయకులు హైదర్, దాము తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ కావమ్మ కథ నాలుగవ వార్షికోత్సవం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** శ్రీకావమ్మ మారయ్య, శ్రీరామ మందిరం నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా జూలై 4, 5 ,6 తేదీలలో నిర్వహించే శ్రీ కావమ్మ మారయ్య కథ కరపత్రాలను ముఖ్య అతిథులు ఆలయ నిర్వాహకులు మాజీ కౌన్సిలర్ నెల్లూరు రవికుమార్ . శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ వడకలూరు మస్తానయ్య చేతులు మీదుగా శ్రీ కావమ్మ, మారయ్య కథ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నెల్లూరు కన్నయ్య, నెల్లూరు జగదీష్, కాట్రపల్లి చంద్రశేఖర్, నెల్లూరు గాంధీ, నెల్లూరు శివ ప్రసాద్, బెట్టెం వెంకటేశ్వర్లు, పనబాకం శరవణ కుమార్, నెల్లూరు సతీష్, కాట్రపల్లి మోహనకృష్ణ,పాడి కమలాకర్, ఆర్ముగం, ప్రసాద్

## పోటుకనుమ లో ఘనంగా ద్రౌపదిమాత కల్యాణోత్సవం

**పూతలపట్టు(మేజర్ న్యూస్ :**పూతలపట్టు మండలం లోనిపో టు కనుమ గ్రామంలో మహాభారత యజ్ఞంలో ఐదవ రోజు గాను ఈరోజు ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటలకుద్రౌపతి కళ్యాణోత్సవం వేద పండితులతోఘనంగా నిర్వహించడం జరిగిందిఈ కళ్యాణోత్సవము గంగారపు చిన్న స్వామి నాయుడు, వారి సతీమణిరమణి వారి ఆధ్వర్యంలో ఘనంగా ద్రౌపతి మాత కళ్యాణోత్సవం జరిగినది ఈ కార్యక్రమంలో పోటు కనుమ గ్రామపంచాయతీ సర్పంచ్ బాబు నాయుడు అనే భాస్కర్ నాయుడు మరియు ఆలయ ధర్మకర్తలు గ్రామస్తులు తదితరులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







## శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

**తిరుమల మేజర్ న్యూస్:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం విఐపి విరామ సమయంలో ఏపీ హైకోర్టు న్యాయవార్తి జస్టిస్ రవినాథ్ తిలారి,డీఆర్డీఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావులు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద శీర్వచనం అందించగా%ౌ%ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.





## కీలపూడి భక్తి ప్రపత్తులతో అగ్నిగుండం ప్రవేశం

### తొలిసారి పురుషులతో కలిసి మహిళలు కూడా అగ్నిగుండం ప్రవేశం.

### భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం

**సత్యవేడు మేజర్ న్యూస్:** పిచ్చాటూరు మండలం కీలపూడి లోని శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం కంకణం ధరించిన దీక్షాపరుల అగ్నిగుండం ప్రవేశం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ప్రతి ఏటా ఈ ఆలయంలో పురుషులు, చిన్న పిల్లలు అగ్ని గుండం ప్రవేశం చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా తొలిసారి పురుషులతో కలిసి మహిళలు కూడా అగ్నిగుండం ప్రవేశం చేయడం విశేషం.అంతకు ముందు ఉదయం ఆలయంలోని మూల విరాట్ కు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.అనంతరం మహిళలు పొంగళ్ళు పెట్టి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు.సాయంత్రం 5 గంటలకు కంకణం ధరించిన దీక్షా పరులు గ్రామంలోని ఏడు ఎల్లలు నడిచి అక్కడ పుణ్య స్నానాలు ఆచరించి చివరగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అప్పటికే సిద్ధం చేసిన అగ్నిగుండం ఎదుట స్వామి, అమ్మ వార్లను ఉంచి గోవింద నామ స్మరణాలతో అగ్ని గుండం ప్రవేశం చేశారు.ఏర్పాట్లను ఆలయ ధర్మ కర్త పాల్ పద్మనాభం పర్యవేక్షించారు.



## ఎంసెట్ ర్యాంకులు విడుదల చేయండి. కౌన్సెలింగ్‌కు అవకాశం ఇవ్వండి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంసెంట్ ర్యాంకులు పరీక్షలు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ సొసైటీ ద్వారా ఇంటర్ పరీక్షను రాయడం జరిగింది. ఇంటర్ పరీక్ష రాసిన తరువాత ఎంసెట్ ఎగ్జామ్ కు అప్లై చేసి పరీక్ష రాసిన తర్వాత గత నాలుగు రోజులు క్రితం ఈ ఎంసెట్ ఫలితాలను విడుదల చేశారు. ఆ ఫలితాలలో ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియట్ ద్వారా పరీక్ష రాసి ఎంసెట్ అప్లై చేసి ఎంసెట్ రాసినటువంటి విద్యార్థిని విద్యార్థులకు ఎవరికి కూడా ఎంసెట్ ఫలితాలలో మార్కులు మాత్రమే నమోదు చేయడం జరిగింది. ఆ మార్కులతో పాటు మా యొక్క ర్యాంకులను ఇవ్వలేదు. ఎందుకంటే మమ్మల్ని నెట్ సెంటర్ ద్వారా మీ యొక్క ఇంటర్ మార్క్ లిస్ట్ ను అప్లోడ్ చేయమని చెప్పడమైతే జరిగింది. ఇంటర్మీడియట్ మార్క్ లిస్ట్ మేము ఎంసెట్ వెబ్సైట్లో అప్లోడ్ చేయడం కూడా జరిగింది. కానీ మాకు ఎంసెట్ బోర్డు వాళ్ళు ఇంకా మా యొక్క ర్యాంకులను నమోదు విడుదల చేయలేదు. మేము బీటెక్ చదవాలంటే ఈ ర్యాంకులు అవసరం. లేకపోతే మాకు ఫీజురాదు, ఆ యొక్క ఫీజు నెంబర్స్ మెంట్ వెబ్సైట్లు ఏమని చూపెడుతుందంటే మేము ఎంసెట్ పరీక్షలు రాసి క్వాలిఫై అయినా కూడా థిస్ పర్సన్స్ నాట్ క్వాలిఫైడ్ ఇన్ ఎంసెట్ అనేసి చూపెడుతుంది, అప్పుడు మాకు కాలేజీకి రావలసినటు వంటి మాకు రాదు మాకు ఇంటర్మీడియట్ మార్క్ లిస్ట్ నుంచి ఎంసెట్ మార్కులకు 25% మార్కులు కలిపి ఈ



ర్యాంకును ఇస్తారు. మేము ఈ మార్క్ లిస్టు నెట్ సెంటర్ ద్వారా ఎంసెట్ వెబ్సైట్లో అప్లోడ్ చేసాము కానీ ఇంతవరకు మాకు ఈ ర్యాంకులు రాలేదు. కావున మీరు ఎంసెట్ బోర్డు వారిపై కఠినమైన చర్యలు తీసుకొని మాకు ఎవరైతే ఏపీ స్కూల్స్ సొసైటీ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఎంసెట్ రాసి ఉంటారో వారి అందరికీ ర్యాంకులను విడుదల చేయాలని కోరారు. నాలుగు రోజుల్లో కౌన్సెలింగ్ కు వెళ్లాలి ఈ ర్యాంకులు రాకపోతే మమ్మల్ని రానివ్వరు మేము ఆ యొక్క కౌన్సెలింగ్ కు ఇబ్బంది కలుగుతుంది మీరు ఈ విషయాన్ని లోకేష్ ద్వారా ఎంసెట్ బోర్డు వారికి తెలియపరచి తొందరగా మా యొక్క ర్యాంకులను విడుదల చేయించండి అని ఎంసెట్ పరీక్షలు రాసిన విద్యార్థులు కోరుతున్నారు.

# గడ్డ కింద పల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## - డివైడర్‌ని ఢీకొని కాలిపోయిన కారు..
## - ఇద్దరు మృతి-ఇద్దరికీ తీవ్ర గాయాలు..

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి మండలం, గడ్డ కింద పల్లి సమీపంలో తూర్పు పల్లి జాతీయ రహదారిపై అదుపుతప్పిన కారు డివైడర్ ను ఢీకొట్టడంతో వెంటనే కారు నుంచి మంటలు చెల్లరేగాయి. కారు నుంచి మంటలు రావడంతో కారులో ఉన్న వారి అరుపులు, కేకలు వినిపించాయి. మంటలు చెల్లరేగుతున్న కారు నుండి నలుగురిని బయటికి తీయడానికి స్థానికులు తీవ్రంగా కష్టపడ్డారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. ఆ మంటలు పొగదాటికి జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు సమీపంలోని గుడిపాలకు చెందిన మాజీ సిపాయి సిద్దయ్య ఆదివారం పుట్టినరోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చారు. ఉదయం శ్రీవారి దర్శనం చేసుకొని శ్రీవారి దర్శనానంతరంవారంతా గుడిపాలకు బయలుదేరారు. మాజీ సిపాయి సిద్దయ్య చంద్రగిరి మండలం తూర్పుపల్లి జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సిద్దయ్యతో పాటు అతని భార్య కూడా మరణించారు. ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. సిద్దయ్య గతంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ప్రైవేట్ గన్ మెన్‌గా పనిచేసినట్లు సమాచారం. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





# నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం

## - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 9 .30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల,డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు.అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు కూడా వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 డబల్ వన్ డబల్ జీరో కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# సంకల్పం ముందు ఓడిన వైకల్యం



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:**
జీవితం వారికి ఆటంకాలనే ఇచ్చింది. సైదమ్మ, పద్మజ, రాజేష్ ముగ్గురూ జీవితంలో ఎన్నో బాధలు ఎదుర్కొన్నారు. సమాజంలో ఎదురైన నిర్లక్ష్యం, వివక్ష, అవకాశాలు లేమి వారికి ఓ మిషన్, విజన్ కలిగించాయి. వైకల్యమే మా బలం అనే నినాదంతో తామే తమలాంటి వారికోసం ఓవారధి అవసరమని గ్రహించి, స్వీయ ప్రయత్నాలతో చిన్న ట్రస్టును స్థాపించారు. ఈ ట్రస్ట్ వికలాంగులకు ఆసరాగా ఆశ్రయంగా శిక్షణ సాంత్వన కలిగించే కేంద్రంగా ఎదుగుతోంది. వారు తమ బాధనే బలం చేసి, మరెందరికో వెలుగుగా మారారు. ఈరోజుల్లో మనిషి భౌతిక పురోగతిలో ముందుకు సాగుతున్న కొద్ది మానవ సంబంధాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయని అభిప్రాయం వ్యక్తం అవుతున్న వేళ వికలాంగులు. వృద్ధులు సమాజానికి కనిపించని బాధితులుగా మారుతుండడం గమనిస్తుంటే ఈ అభిప్రాయం నిజమై సమాజంలో ఎంతోమంది వికలాంగులు వృద్ధులు అటు కుటుంబాలకు ఇటు ప్రేమ అభిమానాలకు దూరమై జీవిస్తున్న పక్కకు నెట్టివేసిన వర్గంగా మారుతున్నారు. అలాంటి వారినీ చేరదీసి మేమున్నామంటూ ధైర్యాన్నిచ్చి ఒక భరోసా కలిగించాలని ఉద్దేశంతో ముగ్గురు వికలాంగులు కలిసి ప్రారంభించిన ఒక వారధి లక్ష్మీ నరసింహ చారిటబుల్

**ట్రస్ట్ సంస్థ స్థాపన సేవలు :** మా విధుల కోసం కాదు, మా అంకితభావం విధేయతతో వికలాంగులు, వృద్ధులు, అనాధలు, మరియు నిరుపేదలకు సేవలు అందించే ధ్యేయంతో శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్" 2022 అక్టోబర్ 18 వతేదీ ప్రారంభమైంది. మొదట్లో ఇద్దరు వికలాంగులతో ప్రారంభమైన ఈ ఆశ్రమం ప్రస్తుతం 40 మందికి పైగా సేవలందిస్తూ వారు గౌరవంగా జీవించేందుకు సరైన వేదికగా నిలుస్తోంది. ఆశ్రమంలో వారికి పరకాల సేవలను అందిస్తున్నారు వాటిలో ఆశ్రయం కల్పించడం తోపాటు ఉచితంగా భోజన సదుపాయం వైద్య సదుపాయం మరియు బట్టలు ఇంకా మానసిక ఉల్లాసానికి ఆటలు కాలక్షేపానికి పాటలు, వంటి సేవలను అందిస్తున్నారు.నిరుపేదలైన చిన్న పిల్లలకు కావలసిన పుస్తకాలు. వీధి కార్మికులకు కావలసిన భోజనం ఇంకా అవసరంలో ఉన్న వికలాంగులకు కావలసిన సాయాన్ని కూడా ట్రస్ట్ తరఫున అందజేస్తున్నారు. శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ -సవాళ్ల మధ్య సేవా యాత్ర వృద్ధులూ సంరక్షణ కోసం ప్రారంభించిన శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం ప్రస్తుతం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. వాటిలో ముఖ్యమైనది స్థిర నివాసం, ఆర్థిక సహాయాలు లోపం, సిబ్బంది లేమి, వైద్య సదుపాయాలు కొరత వృద్ధుల జీవన నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. రేషన్, ఔషధాలు, హాస్పిటల్ సదుపాయాలు కోసం ప్రభుత్వ మద్దతు అవసరమైంది. ట్రస్ట్ సభ్యులు తమ సామర్థ్యాన్ని మించి కృషి చేస్తూ, వృద్ధుల సంరక్షణ కోసం నిస్వార్థంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు సమాజం నుండి మరింత సహకారం అవసరం ఉంది.

**దాతల సహకారం :** శ్రద్ధావంతులు, సేవాపరులు అంకితభావంతో కొనసాగుతున్న ఈ ఆశ్రమం, దాతలు సహకారంతో నడుస్తుందని నిర్వాహకురాలు సైదమ్మ తెలియజేశారు. ఎంతోమంది దాతలు మేము చేసే సేవలో తమ వంతు సహాయాన్ని అందించారని మా సేవలను మరింత మెరుగ్గా అందించటానికి మరి కొంతమంది దాతల నుంచి సహాయహస్తం కోరుతున్నామని నిస్వార్థ సేవకు అడ్డుపడుతున్న సమస్యలపై చైతన్యం కోరుతున్నామని ట్రస్ట్ నిర్వాహకురాలు తెలియజేశారు.

# మా బడి మాకే కావాలి

## - పివి పురం ప్రజలు బిడ్డలకు చదువు దూరం చేయ వద్దు

**రామచంద్రపురం, మేజర్ న్యూస్:** మండలంలో వుండే ప్రసన్న వెంకటేశ్వరపురం పరమాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను 3,4,5 తరగతులను ఆదర్శ పాఠశాల పేరుతో విలీనం చేసే ఆలోచన విరమించుకోవాలని పివి పురం సిఐటియు ఎస్ఎఫ్ఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామాన్ని సందర్శించి ప్రజలతో అభిప్రాయాలు తెలుసుకొని నినదించడంజరిగింది. సమర్పించిన వారిని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వందవాసి నాగరాజు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే సుమన్, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీల రాష్ట్ర కోకన్వీనర్ అశోక్ కుమార్ ఎస్ఎఫ్ఐ నగరకార్యదర్శి తేజ తదితరులు కలిసి గ్రామంలో ఉన్న పాఠశాలను సందర్శించి అక్కడ ప్రజలతోనూ మరియు విద్యార్థులతోనూ మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా మా బడి మాకే కావాలి మాకు న్యాయం జరగాలి గ్రామస్తులు నినాదాలు ఇవ్వడం జరిగింది.ఆర్ సి పురం మండలంలో పివిపురంలో ఉన్న మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో బలిజిపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్లో విలీనం చేశారు. దీంతో ప్రక్కన ఉన్న రామిరెడ్డిపల్లి, ఎస్టీ కాలనీ గంగమాంబ పురం, అరుంధతి వాడ పివిపురం గ్రామాల నుంచి విద్యార్థులు రాష్ట్ర రహదారిపై నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.దీంతో చుట్టుపక్కల ఉన్న విద్యార్థులు ఆ గ్రామానికి వెళ్లి చదువుకోవాలంటే తీవ్రమైన ఇబ్బందులకు రావాల్సిన



పరిస్థితి ఏర్పడింది. ఆ ఊరు నుంచి బలిజిపల్లికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఆ రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదవశాస్తూ ఏదైనా యాక్సిడెంట్ జరిగితే అవకాశం ఉంది. ప్రస్తుతం పి. వి పురం పాఠశాలలో 45 మంది విద్యార్థులు ఉన్నారు అదేవిధంగా బలిజిపల్లి లో ఉండే పాఠశాలలో 22 మంది మాత్రమే ఉన్నారు. అక్కడ స్కూల్ కమిటీ చైర్మన్ చర్చించకుండా గ్రామ కమిటీలు తీర్మానం చేయకుండా మండల పరిషత్ లో తీర్మానం చేయకుండా ఆ స్కూల్ ని ఎలా మారుస్తారని ప్రశ్నించారు? పి వి వి పురం నుంచి స్కూలు మారిస్తే ఎక్కువ మంది విద్యార్థులు స్కూలుకు దూరం కావలసిన పరిస్థితి ఏర్పడుతుంది కాబట్టి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం...అదేవిధంగా పివిపురంలో ఉండే మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడానికి అనుగుణంగా ఆ పాఠశాల స్థలం మూడున్నర ఎకరా ఉంది.కాబట్టి పివీ పురం లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ కమిటీ చైర్మన్ రాందాస్ రెడ్డి మల్లారెడ్డి తదితరుల గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాట్రపల్లి గ్రామంలో ఎంజీఎం ఉచిత వైద్య శిబిరం

కెవిబి పురం మేజర్ న్యూస్: సత్య వేడు నియోజకవర్గం కేవీబీ పురం మండలం కాట్రపల్లి గ్రామంలో ఆదివారం ఎంజీఎం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో కాట్రపల్లి చుట్టు ప్రక్క గ్రామాలు ప్రజలు దాదాపు 200 మంది పాల్గొన్నారు. శ్రీకాళహస్తి ఎంజీఎం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఎంజీఎం హాస్పిటల్స్ వారు అవసరమగు పరీక్షలు ఉచితంగానే చేసారు. పరీక్షలు అనంతరం అవసరమగు మందులు కూడా ఉచితంగానే అందజేశారు. కాట్రపల్లి గ్రామంలో ఈ వైద్య శిబిరం నిర్వహణ శ్రీకాళహస్తి బీజేపీ అధ్యక్షులు కోలా ఆనంద్ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలొ ఎంజీఎం హాస్పిటల్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి చుట్టుపక్క మండలాలకు 24 గంటలు డాక్టర్ లు అందుబాటులో ఉంటూ అన్ని అత్యాధునిక సౌకర్యాలతో ఎన్టీఆర్ వైద్య సేవ మరియు అన్ని రకాల ఇన్సూరెన్సు సేవలు అందుబాటులో వున్న హాస్పిటల్ ఎంజీఎం హాస్పిటల్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలొ ఎంజీఎం డాక్టర్ లు . వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





## ఎంపీ గురుమూర్తిని కలిసిన శ్రీకాళహస్తి మైనారిటీ నేతలు

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్:** తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దెల గురుమూర్తిని శ్రీకాళహస్తి నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్ కలిశారు. ఆదివారం ఎంపీ జన్మదినాన్ని పురస్కరించుకొని మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఎంపీ గురుమూర్తిని కలిసి దుశ్శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ సభ్యులు పీఎం చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ గురుమూర్తి జన్మదిన వేడుకలు



**బుచ్చినాయుడు కండ్రిగ, మేజర్‌న్యూస్:** బి. ఎన్ కండ్రిగలో ఎంపీ గురుమూర్తి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్టింగ్ మరియు అన్నదాన కార్యక్రమం చేసి అందరూ గురుమూర్తి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు.అనంతరం వైస్సార్సీపీ మండల అధ్యక్షుడు కె. మణి నాయుడు మాట్లాడుతూ గురుమూర్తి తిరుపతి పార్లమెంట్ ని తక్కువ సమయంలో ఎంతో అభివృద్ధి చేయారు అని అందరిని ఆప్యాంగా మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తారు అని చెప్పారు, సోషల్ మీడియా కో కన్వీనర్ వేలూరు రాకేష్ మరియు రాష్ట్ర సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గుముడి గురునాథం మరియు గ్రివియన్స్ కార్యదర్శి సాయి నాయుడు, జిల్లా క్రియాశీలక కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి మరియు జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవి రెడ్డి, దేవదాసు రెడ్డి గురుమూర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు ఈ కార్యక్రమం లో గురవయ్య, చంద్రారెడ్డి, జయచంద్ర నాయుడు, ప్రసాద్ పాల్, సంజీవయ్య, నాగూరు, గంగాధరం,రమేష్ నాయుడు, రమేష్, మునిరత్నం మోహన్, శివయ్య, క్రిష్టాయ్య,కె.బాలాజీ, కె సురేష్, చంద్ర, వెంకటయ్య, కె. సురేష్, పరంధామయ్య, అశోక్, కిరణ్ యాదవ్,వెంకటేష్, సిద్దేశ్వర్, కె. శివ, విలేకరులు,యువకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం

**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో ఆదివారం కోగిలి జయరామిరెడ్డి సేవా సంస్థ కోటపోలూరు మరియు శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వారి సహాయ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరమును నిర్వహించడం జరిగినది ఈ శిబిరం నందు 150 మందికి కంటి పరీక్షలు చేయడం జరిగినది వీరిలో 58 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తము శ్రీ అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతికి పంపడం జరిగినది ఈ శిబిరము కోగిలి జయరామిరెడ్డి సేవా సంస్థ వ్యవస్థాపకుడు సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగినది. ఈ శిబిరాన్ని మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది.



## వైభవంగా ముగిసిన మాతమ్మ తిరునాళ్ళు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరంమేజర్ పంచాయితీ సుద్దగుంట వద్ద వెలిసిన మాతమ్మ తిరునాళ్ళు పురస్కరించుకొని ఆదివారం ఉదయం అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేక అలంకరణ అర్చన, రేణుకా మాతమ్మ విశ్వరూపంలో ముగ్గు అగ్నిగుండ ప్రవేశం వైభవంగా నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్య సమర్పించారు. ఉభయ దాతలుగా ఏ కుల రవి, గుడిమల్లం ఆనంద్, ఉసురుపాటి గోవిందస్వామి కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. బాలయ్య చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నబ్బ, వెంకటరమణ, గురవయ్య గురవ మండడి. తదితరులు పాల్గొన్నారు.



# జగన్ క్రూరత్వానికి సింగయ్య బలి

**-బిసి విభాగం, తెలుగుదేశం టీడీపీ నేతలు**



**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్:** మరణ మృదంగం వాయిస్తూ, శవాలను చూసి నవ్వుతూ, తనలో తానే మాట్లాడుకుంటూ, ఆయన వారి చావులపై వచ్చే సానుభూతిని రాజకీయంగా తనకు అనుకూలంగా మలచుకున్న వైసిపి అధినేత జగన్ రెడ్డి క్రూరత్వానికి సింగయ్య బలయ్యాడని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆరోపించారు. జులాయిగా తిరుగుతూ బెట్టింగ్ కార్యకలాపాలతో నష్ట పోయి అప్పుల పాలయ్యి ఒక సంవత్సరం క్రితం ఆత్మహత్య చేసుకున్న ఒక అక్రమార్కుడిచావును రాజకీయంగా ఉపయోగించుకొని లబ్ది పొందాలన్న దురాశతో జగన్ రెడ్డి పల్నాడు పర్యటనకు వచ్చి ఇద్దరి మరణానికి కారణమై మరోసారి తన క్రూరత్వాన్ని చూపించుకున్నాడని ఆరోపించారు. తన పేదరికం కష్టాలు తీర్చుకోవడానికి రోజువారీ కూలి పనులకు వెళ్ళే సాధారణ దళిత వ్యక్తి సింగయ్య జగన్ రెడ్డి కారు క్రింద పడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంటే వైసిపి అధినేత కనీసం దిగి అతన్ని హాస్పిటల్ కు పంపే ప్రయత్నం కూడా చేయకపోవడం జగన్ నిర్దయ మనస్తత్వాన్ని తెలియజేస్తోంది. నరుకుతాం, తొక్కుతాం అని చెప్పి మరీ ఇద్దరిని పొట్టనపెట్టుకున్న జగన్ రెడ్డి కర్కశత్వానికి ఇంకెన్ని ప్రాణాలు బలి కావాలని ప్రశ్నించారు. స్వర్గీయ సింగయ్య మృతికి కారణమైన జగన్ రెడ్డి పైన హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, చిన్నారెడ్డి, సెల్వం, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం.ఉమేష్ రావు, తిరుపతి పార్లమెంటు నాయకులు పేట బాలాజీ రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్, యం.యస్.రెడ్డి, అంకయ్య గౌడ్, భాస్కర్ గౌడ్, హరి తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల సంస్థ ప్రచార కార్యదర్శిగా నారాయణ శెట్టి ఎన్నిక

**పలమనేరు మేజర్‌న్యూస్:** జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ పలమనేరు నియోజకవర్గం ప్రచార కార్యదర్శిగా మారేడుపల్లి గ్రామానికి చెందిన నారాయణశెట్టిని ఎన్నిక చేసినట్టు ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి. మునిరత్నం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఆది వారం పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయం నందు డివిజన్ కార్యదర్శి మణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి పులికంటి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు పార్థసారథి, రత్నమ్మ, సూర శ్రీనివాసులు, సాంబశివ




మాట్లాడుతూ... గత ఐదు సంవత్సరాలు నుండి జిల్లా, స్థాయిలో ప్రజా సమస్యలపై మానవ హక్కుల సంస్థ నిరంతరం రాజీ లేని పోరాటాలు చేసి పరిష్కారానికి కృషి చేస్తున్నదని గుర్తు చేశారు. అందులో భాగంగా యువకులు మేధావులు,సమాజం పట్ల మంచి పట్టున్న వ్యక్తులు మానవ హక్కుల సంస్థ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 300 ప్రజా సమస్యలు పరిష్కారం 30 మంది భార్య భర్తలకు కౌన్సిలింగ్ ద్వారా కలపడం పోరాటం ద్వారా కార్మిక సమస్యలను పరిష్కరించి ప్రజలు మున్ననులు పొందామన్నారు. నూతనంగా ఎంపికైన ప్రచార కార్యదర్శి నారాయణ శెట్టి మాట్లాడుతూ... మానవ హక్కుల సంస్థ తనపై ఎంతో నమ్మకముతో ప్రచార కార్యదర్శి పదవిని అప్పగించారని అదే నమ్మకముతో ఎక్కడ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంస్థ కట్టుబాట్లకు లోబడి ఎటువంటి పారితోషకాలు ఆశించకుండా తన సొంత పనులను సైతం పక్కనపెట్టి నిస్వార్థముతో ప్రజలకు సేవ చేయడానికి ముందుంటానని ధీమా వ్యక్తం చేశారు. తనను ప్రచార కార్యదర్శిగా ఎంపిక చేసిన మానవ హక్కుల సంస్థ బృందానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూదేవి, అన్నపూర్ణ, శ్రీదేవి, రక్షిత, అనసూయ, ఆనంద, శివకుమార్, సర్దార్, అమానుల్లా, గుర్రం సుబ్రహ్మణ్యం తో పాటు 30 మంది నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలమనేరు బాలాజీకి సడ్లపల్లె కథా పురస్కారం

పలమనేరు మేజర్ న్యూస్: స్థానిక కవి ,రచయిత పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీ తన ఏకలవ్య కాలనీ కథా సంపుటికి ఆదివారం హిందూపురంలో జరిగిన సభలో తపన సాహిత్య వేదిక నుండి సడ్లపల్లె కథా పురస్కారాన్ని అందుకున్నారు.ప్రముఖ కథా రచయితలు సడ్లపల్లి చిదంబర రెడ్డి శశికళ శాంతి నారాయణ స్వర్ణ కిలారి ఈశ్వర రెడ్డి, డాక్టర్ ఎం. ప్రగతి, చాంద్ భాషా క్రైమలి గండికోట వారిజ హిందూపురం డి.ఎస్.పి. కె.వి మహేష్, ప్రముఖ వైద్యానిపుణులు డాక్టర్ ఎనమదల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఎరుకల జన జీవితాలను, వారి గుండె చప్పుళ్లను కన్నీళ్లను ఆత్మగౌరవ పోరాటాలను ఏకలవ్య కాలనీ కథల ద్వారా ప్రపంచానికి కళ్లకు కట్టినట్టుగా రచయిత తెలియ చెప్పారని అందుకే ఈ కథా సంపుటికి బహుజన సాహిత్య పురస్కారం గీతాంజలి స్మారక పురస్కారం కెనడా తెలుగు తల్లి పురస్కారం, సడ్లపల్లె కథా పురస్కారం లభించాయని సమీక్షకులు సహ ఆచార్య జి.యమునా రాణి అన్నారు. ఇన్నేళ్ల తెలుగు సాహిత్యంలో తొలి ఎరుకల కథా సంపుటిగా ఏకలవ్య కాలనీ ఒక మలుపు అని ఆమె అన్నారు. తెలుగు సాహిత్యంలో ఎరుకల జన జీవితాలను చిత్రీకరించిన తొలి రచయిత పలమనేరు బాలాజీ అని వక్తలు ప్రశంసించారు.తన రచనలకు తెలుగు సాహిత్య రంగంలో మూడు దశాబ్దాలకు పైగా చేస్తున్న కృషికిగాను పలమనేరు బాలాజీ రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్నాడు.కథా కవితా నవలా ప్రక్రియలలో స్మైల్ పురస్కారం కందుకూరి వీరేశలింగం పంతులు స్మారక పురస్కారం తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, నూతలపాటి గంగాధరం పురస్కారం మాడభూషి రంగాచార్యస్మారకపురస్కారాలను,



హొసూరు ఉగాది పురస్కారాలను అందుకున్నారు. పురస్కార గ్రహీత పలమనేరు బాలాజీని పలువురు రచయితలు సాహితీవేత్తలు ప్రశంసించారు.

## బోయకొండపై తరగని భక్తుల రద్దీ

**చౌడపల్లి రూరల్, మేజర్‌న్యూస్:** శక్తి క్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు ముగిసినప్పటికీ రాష్ట్రం తో పాటు కర్ణాటక తమిళనాడు తెలంగాణ ల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో బోయకొండ భక్త జనసంద్రమైంది. ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో అధికార సిబ్బంది అర్చకులు బోయకొండ ఆలయం కింద గల భవాని నగర్ తదితర ప్రాంతాల్లో భక్తులకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూ లైన్ లన్నీ భక్తులతో కిటకిటలాడాయి .ఈ సందర్భంగా అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

**రామచంద్రాపురం, మేజర్‌న్యూస్:** మండలంలోని రావిళ్ళవారిపల్లి పంచాయతీ రావిళ్ళవారిపల్లి గ్రామానికి చెందిన ధీరజ్ కూమార్ నివేత నివాసం వద్ద మరవలి శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నాని .అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పులివర్తి నాని ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, సురేంద్ర నాయుడు, ముని రామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మాధవయ్య రాయల్ కోటేశ్వర్ రెడ్డి, కోర హరి ప్రసాద్ నాయుడు, సురేంద్ర నాయుడు ముని రామిరెడ్డి ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెటర్నరీ యూనివర్సిటీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి



**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** వెటర్నరీ యూనివర్సిటీలో విద్య బోధనలు బోధించే అసిస్టెంట్ ప్రొఫెసర్ రవివర్మకు కూర్చోవడానికి కుర్చీ కూడా లేకుండా తొలగించి అవమానపరిచిన వెటర్నరీ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కులవ్యక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్డీ. శ్రీనివాసులు, ఆర్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రఘు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సెలవులో వెళ్లి డ్యూటీ కి వచ్చిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి వర్మ తన చాంబర్ కి వెళ్లి చూడగా కూర్చునే కుర్చీని లేకుండా చేయడం అంటే దళితుల్ని అవమానపరచడమేనని, అందుకు కారణమైనటువంటి ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలని, అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రిన్సిపాల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని వీసీని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శ్రీకాళహస్తి వైయస్ షర్మిల రెడ్డి సభను జయప్రదం చేయండి

**- డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి శ్రీకాళహస్తి పర్యటనలో భాగంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం జూన్ 23 వతేదీ సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ఆర్ జి ఆర్ ఫంక్షన్ హాల్ జరుగు జిల్లా సమీక్ష సమావేశంనకు హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, ఉపాధ్యక్షులు శబరి రాజన్, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, కోశాధికారి వేలు, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు చెరుకు తోట రాహుల్, ఆంటోనీ,శ్రీకాళహస్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్, ఆసిఫ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం వచ్చినందుకు థాంక్యూ సీఎం సార్



**తిరుపతి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇచ్చిన హామీ ప్రకారం జూన్ 12వ తారీఖున2025 తల్లుల అందరి ఖాతాల్లో రాష్ట్రంలో 67 లక్షల 27 వేల 164 మందికి 8745 కోట్లు ఒకేసారి జమ చేయడం జరిగింది. ఈ పథకం నిరుపేద మధ్యతరగతి వర్గాలకు చెందిన వారికి ఉపయోగపడుతుంది ప్రతి ఒక్కరు తమ పిల్లల్ని చదివించడానికి ఆసక్తి చూపుతారు మధ్యలో బడి ఆపేసిన పిల్లలు తిరిగి బడికి వచ్చేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. దేశంలో ఇంతవరకు ఇలాంటి పథకం ఇంతవరకు ఎక్కడ అమలు జరగలేదు ఒక్క ఆంధ్రప్రదేశ్లో తప్ప దీనిని బట్టి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు పేదల పట్ల నిరుపేద విద్యార్థుల పట్ల ఎంత అంకితభావం ఉందో తెలుస్తోంది. అందుకే ఈరోజు కూటమి ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అన్ని వర్గాల వారు పిల్లల్ని చదివించుకోవడానికి ఇబ్బంది లేకుండా ఈ పథకం ఒక వరం లాంటిది. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మ వడి ఇస్తానని అధికారంలోకి వచ్చిన తర్వాత దగా చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి పేద వర్గాల మీద ఎంత ఆక్రోషం ఉందో తెలుస్తుంది దీనికి నిదర్శనమే ఈరోజు కూటమి ప్రభుత్వం వైసీపీ పార్టీకి మధ్య వ్యత్యాసం అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలన్నిటిని కూడా తూచా తప్పకుండా అమలు చేస్తా ఉంది. గత ప్రభుత్వంలో నిబంధనల పేరిట లబ్ధిదారులకు అందరికీ కోతల విధించింది ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వాన్ని మరొక్కసారి ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో రుజువు చేసింది అందుకు ఉదాహరణ తల్లిదండ్రులందరూ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, రజక సాధికార కమిటీ రాష్ట్ర మెంబర్ ఎస్ శంకర్, బీసీ నాయకులు రవిశంకర్ యాదవ్ పిల్లల తల్లిదండ్రులు పెంచలయ్య, మల్లికార్జున్, బాలకృష్ణ, గిరి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ ఉపాధ్యాయునికి వీడ్కోలు



**తడ, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పాముల మిట్ట గ్రామంలో ఎనిమిది సంవత్సరాలు పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఉస్మాన్ బాషా ని ఆదివారం పాములు మిట్ట గ్రామ పెద్దలు ఎస్ఎంసి కమిటీ సభ్యులు, పేరెంట్స్ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున రావు హాజరయ్యారు, అనంతరం ఎంఈఓ ప్రసంగిస్తూ ప్రధానోపాధ్యాయలుగా ఉస్మాన్ బాషా ఉత్తమ సేవలు అందించారని తెలిపారు . అదేవిధంగా గ్రామ పెద్దలు సుబ్రహ్మణ్యం రెడ్డి మునిరాజరెడ్డి చిరంజీవి రెడ్డి మరియు పేరెంట్స్ కమిటీ చైర్మన్ మునిరాజా వైస్ చైర్మన్ వెంకటలక్ష్మి పాల్గొని ప్రత్యేకంగా సన్మానించి వారి మరిన్ని విజయాలను ఆకాంక్షిస్తూ రాబోయే రోజుల్లో మంచి సేవలను ఇతర పాఠశాలలో కూడా అందించాలని తెలియజేశారు,పేరెంట్స్ కమిటీ చైర్మన్ మునిరాజా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ బడి నుంచి క్రమం తప్పకుండా వివిధ ప్రాంతాల్లో గురుకుల,మోడల్ పాఠశాలల్లో ప్రవేశాలు పొందేలా ఆయన తర్ఫీదు ఇచ్చారని పేర్కొన్నారు. బడిని పేరెంట్స్ కమిటీ సహకారంతో అందంగా రంగులు చిత్రాలు తో తీర్చి దిద్ది నందుకు తల్లి దండ్రులు అభినందించారు.పాముల మిట్ట పేరెంట్స్ , గ్రామ ప్రజల సహకారం మరువలేనిది ఉస్మాన్ బాషా తెలిపారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**- చిత్తూరు ట్రాఫిక్ సిఐ నిత్య బాబు...**



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చిత్తూరు ట్రాఫిక్ సిఐ నిత్య బాబు సూచించారు. ఆదివారం సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ అధిగమించడం వల్లనే అధికంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. బైకులు నడిపేవారు హెల్మెట్ ధరించాలని, కారుల్లో ప్రయాణించే వారు సీట్ బెల్టు ధరించాలని సూచించారు.ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.రికార్డులు లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్దమన్నారు.అలాంటి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.నిబంధనలు పాటించని వారికి భారీ జరిమానా విధిస్తామన్నారు.

## ఎస్వి వైద్య కళాశాలలో ఐఏపి, ఏఎల్ఎస్ కోర్సు శిక్షణ తరగతులు

**తిరుపతిరెవెన్యూ, మేజర్‌న్యూస్:** తిరుపతిలోని ఎస్వి వైద్య కళాశాలలో



జూన్ 21, 22 తేదీలలో చివరి రోజు అయినా ఈరోజు చిన్న పిల్లల విభాగం పీడియాట్రిక్ పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, పీడియాట్రిక్ వైద్యుల కోసం, ఐ ఏ. పి, అండ్ ఏ. ఎల్ ఎస్ కోర్సు నిర్వహిం చబడింది. తిరుపతి, కడప, నెల్లూరు, చిత్తూరు, కుప్పం నుంచి 40 మంది పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవిప్రభు, సూపరింటెండెంట్ డాక్టర్ జె. రాధా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డిఎస్ మూర్తి, చిన్న పిల్లల విభాగ అధిపతి డాక్టర్ మనోహర్ హాజరయ్యారు. డాక్టర్ జి. సుధాకర్, డాక్టర్ రఫీక్, డాక్టర్ ఎఎస్ కిరీటి, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ శశికుమార్, డాక్టర్ స్పందన, డాక్టర్ పద్మశ్రీ పాల్గొన్నవారికి శిక్షణ ఇచ్చారు. ఈ కోర్సు పీడియాట్రిక్ వైద్యులు అనారోగ్య బాలలను త్వరగా గుర్తించి, అధునాతన జీవన రక్షణ చికిత్స ద్వారా మరణాలను నివారించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

# కార్యకర్తలకు అండగా ఉంటాం: చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**రామచంద్రపురం మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్సిపి చంద్రగిరి నియోజకవర్గ సమన్వయ కర్త మోహిత్ రెడ్డి వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు అండగా నిలుస్తామని చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. ఆదివారం కుప్పం బాదూరు లో టిడిపి కార్యకర్తల దాడిలో గాయపడిన నియోజకవర్గం సోషల్ మీడియా సమన్వయకర్త సింధుల్ కుమార్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షలతో వ్యక్తిగతంగా దాడులు చేయడం బాధాకరమన్నారు. పోలీస్ స్టేషన్లో కేసు తీసుకోకపోవడం కనీసం హాస్పిటల్లో చేర్చుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మా నాన్నను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమంగా లిక్కర్ కేసులో ఇరికించి పై బాచిగా ఆనందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఏవి బ్రహ్మానందరెడ్డి, నాయకులు పవన్ కుమార్ రెడ్డి, శంకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, రాయలచెరువు సర్పంచ్ మురగయ్య, వైస్ ఎంపీపీ లావణ్య, చంద్రబాబు, వైఎస్ఆర్సిపి ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు నెల్లేపల్లి వెంకటేశు, మారయ్య ,భాస్కర్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.



## వైసిపి మండల యువజన అధ్యక్షుడిగా గణపతి రెడ్డి



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలం వైసిపి మండల యువజన అధ్యక్షుడిగా గణపతిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు అందినట్లు గణపతి రెడ్డి తెలిపారు. తనకు యువజన అధ్యక్షుడిగా నియామకం కావడానికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేయునట్లు గణపతి రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న ఆహార కల్తీ

(మొదటిపేజీ తరువాయి)

పదార్థాల విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. ఆ తర్వాత మళ్లీ యథా మామూలే. బేకరీలు, హోటళ్ల తిండి కోసం జనం క్యూ కడుతున్నారు. బయటి పదార్థాలు కొనే ముందు ఎక్కువమంది కాలం చెల్లిన తేదీ వివరాలు చూసుకోకుండా పోవడం ఎక్కువ నష్టం కలిగిస్తోంది.

**నాసిరకం వంట నూనెల వినియోగం...** పలు హోటళ్లు, స్వీట్స్ స్టాల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఇతర తినుబండారాల షాపుల్లో యథేచ్ఛగా నాసిరకం నూనెలను వినియోగించడమే కాక వాడిన నూనెలను పలుమార్లు మరిగించి మరిగిం చి నిబంధనలను పక్కన పెడుతున్నారు. ఒకసారి వాడిన వంట నూనెను మూడు సార్లకంటే ఎక్కువగా వాడకూడదు. ఎక్కువసార్లు నూనెను మరిగిస్తే అందులోని భౌతిక, రసాయన, పోషక, ఇంద్రియ లక్షణాల్లో మార్పు వస్తుంది. నూనె నాణ్యతలో టిపిసి శాతం లోపిస్తే అనేక అనర్థాలు కలుగుతాయని వైద్యులు సూచిస్తున్నారు. 25 శాతం మించితే బిపి పెరిగి గుండె, కాలేయం వ్యాధులు ఉత్పన్నం అవుతాయని చెబుతున్నారు. రంగులు, రసాయనాలు ఆరోగ్యానికి హాని కలిగించే టెస్టింగ్ సాల్ట్, కాలుష్యం కార్బైడ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలను అందరూ తినే ఆహార పదార్థాల్లో వాడుతున్నా వినియోగదారులు అవేమీ పట్టించుకోవడం లేదు.

**నిల్వ ఉంచిన పదార్థాల విక్రయాలు...** తిరుపతి జిల్లాలో ఫుడ్ లైసెన్స్ పొందిన హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, దాభాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఇవి కాకుండా అనుమతి లేకుండానే నిర్వహిస్తున్న దుకాణాలు లెక్కకు మించి ఉన్నాయి. తోపుడు బండ్లకైతే లెక్కే లేదు. ఆహార పదార్థాలు ముఖ్యంగా మాంసాహార పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించడానికి రకరకాల రంగులు వినియోగిస్తున్నారు. ఆహార భద్రతా అధికారులు నమూనాలు సేకరిస్తున్న ప్రతిచోటా ఇవి హానికరమే అంటూ ల్యాబ్ రిపోర్టులు చెప్తున్నా యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.



హోటళ్లు, రెస్టారెంట్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను సైతం మాంసాహార ప్రియులకు అంటగడుతున్నారు. బేకరీల్లో తయారుచేసే పదార్థాలు ఎన్ని రోజులు నిల్వ ఉంటాయో చెప్పలేని పరిస్థితి. ప్యాకేజ్ వస్తువులు ఎప్పుడు తయారు చేశారు, కాలం ఎప్పుడు తీరుతుందనే వివరాలు కూడా చాలా వరకు ఉండటం లేదు. ప్యాకేజీయక్ట్ ప్రకారం విక్రయించే ఆహార పదార్థాలన్నింటిపై తగిన వివరాలు ఉండాల్సిందేనని అధికారులు స్పష్టంచేస్తున్నారు. నిబంధ నలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు వున్నప్పటికీ బయటకొనే పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, లేదంటే ఆనారోగ్య సమస్యల బారిన పడతారని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.

**ఆహారంలో కలుస్తున్న ప్లాస్టిక్...** ఇక నిషేధిత ప్లాస్టిక్ వినియోగమయితే వేరే చెప్పనక్కర్లేదు వేడివేడి టీ, పాలు, సాంబారు వంటి వేడి పదార్థాలను సన్నటి మందం కవర్లలో పోసి ఇస్తున్నారు. ఉప్మా, దోశ ఇలా ప్రతిదీ కాగితంపైన ప్లాస్టిక్ కవరు పరిచి ప్యాక్ చేసి ఇస్తున్నారు. మధ్యాహ్నం భోజనం, బిర్యానీ వంటి ఏ ఆహారమైనా ఎంత వేడిగా ఉన్నా ఎవరూ ఆలోచించడం లేదు. పేపరు ప్లేట్ల పేరుతో ప్లాస్టిక్ పూత కలిగినవే ఎక్కువ వాడుతున్నారు. ఇది సులువుగా ఆహారంలో కలిసి అనారోగ్యం కలిగిస్తున్నాయి. ఆహార పదార్థాల తయారీలో ఉపయోగించే ముడి సరుకుల్లో కల్తీ యథేచ్ఛగా సాగుతోంది. వాడిన మరిగిన నూనె రోజుల తరబడి ఆహార పదార్థాల తయారీలో వాడుతుండడంతో వినియోగదారులకు పలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కల్తీ టీ నుంచి నిత్యవసర సరుకులు మిరప్పొడి, కందిపప్పుతో సహా అన్నీ కల్తీ మయమే.. హోటళ్లలో విక్రయించే ఆహార పదార్థాలు, బేకరీలో తయారయ్యే చిరుతిండ్లు, తినుబండారాలు వరకు వ్యాపార లాభాపేక్షతో కల్తీమయంగామారిపోతున్నాయి. కారప్పొడి, కందిపప్పు, పెసరపప్పు, శనగపిండి, ఇడ్లీ రవ్వ, ఇలా అన్నీ కల్తీనే ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కల్తీ టీ పొడి వినియోగించడం ద్వారా కిడ్నీ వ్యాధి సమస్యలతో పాటు ఉదర సంబంధ వ్యాధులు కేన్సర్, తదితర అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది.

**లైసెన్సు లేకుండానే ఇష్టారాజ్యంగా వ్యాపారాలు**

అంతే కాకుండా రోడ్డు పక్కన విక్రయించే వివిధ చిరుతిండ్లు, దాబాలు, ఇతర హోటళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. లైసెన్సు లేకుండానే విక్రయాలు ఫుడ్ లైసెన్స్ అనుమతులజారీ మూడు కేటగిరీలుగా జారీ చేస్తున్నారు. సంవత్సరానికి రూ. 12లక్షల లోపు టర్నోవర్ ఉన్న తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు రూ.వంద, రూ. 12 లక్షలు దాటి టర్నోవర్ కలిగిన ట్రేడర్స్, మార్కెటింగ్ వ్యాపారులు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు లైసెన్స్ చెల్లించాల్సి ఉంటుంది. రూ.20కోట్లు టర్నోవర్ దాటితే రూ.7,500 అనుమతి రుసుము చెల్లించి సెంట్రల్ లైసెన్స్ తీసుకోవాలి. ఈ నిబంధనలు చాలా వరకు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు.



**చిన్న పిల్లల ఆరోగ్యాలతో చెలగాటం...** మాంసాహారాల్లో రంగులు కలపడం, ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్న ఘటనలు ఒక వైపు యథేచ్ఛగ సాగుతున్నాయి. మరో వైపు, కాలం చెల్లిన తినుబండారాలను విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా చిన్నపిల్లలు అమితంగా ఇష్టపడే కురుకురే, లేస్, బిస్కట్ ప్యాకెట్లు వినియోగ తేదీ దాటినా అమ్మకాలు సాగిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఆర్టిసి కాంప్లెక్స్, బస్టాండ్లలో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రయాణాల హడావుడిలో వినియోగదారులు సరిగా తేదీ చూసే సమయం ఉండక పోవడంతో ఇదే అదనుగా వ్యాపారులు ప్రజలకు అంటగడుతున్నారు.

**శిక్షకు భయపడని కల్తీదారులు...** ఫుడ్‌సేఫ్టీ అండ్ క్వాలిటీ యాక్ట్, 2006 ప్రకారం ఎవరైనా కల్తీ ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయడం, విక్రయించడం, పంపిణీ చేయడం వంటివి చేస్తూ పట్టుబడితే తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. నేరారోపణపై జరిమానా, శిక్ష.. ఒక్కోసారి రెండూ విధించవచ్చు. కల్తీ ఆహార పదార్థాలను తయారుచేసి విక్రయిస్తే రూ.లక్ష వరకు జరిమానా విధించవచ్చు. నేరం తీవ్రతను పరిగణనలోకి తీసుకుంటే, అటువంటి కేసులకు 6 నెలల నుంచి 7 సంవత్సరాల వరకు శిక్ష విధిస్తారు. కల్తీ ఆహారం తిన్న వ్యక్తి మరణిస్తే, కల్తీ చేసిన వ్యక్తికి జీవిత ఖైదు లేదా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించవచ్చు. అయినా ఇన్నీ తెలిసి కూడా భయపడకుండా కల్తీవ్యాపారం నిర్వహించడం విశేషం.

## భాకరాపేట అటవీ ప్రాంతంలో
# ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

### 6 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** భాకరాపేట-కళ్యాణీ అటవీ ప్రాంతంలో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి, ఆరు ఎర్రచందనం దుంగలతో పాటు, ఒక మోటారు సైకిల్‌ను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా, టాస్క్ ఫోర్సు ఎస్పీ, పి.శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ జె.బాలిరెడ్డి మార్గనిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ కే.మహేశ్వరనాయుడు టీమ్ శనివారం రాత్రి స్థానిక ఎఫ్బీఓ సి.రవితో కలిసి నాగపట్ల ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ఆదివారం ఉదయం భాకరాపేట-కళ్యాణీ అటవీ మార్గంలో ఒక మోటారు సైకిల్‌తో పాటు, ఇద్దరు వ్యక్తులు కనిపించారు. వీరిని సమీపించడంతో పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే వారిని పట్టుకుని చుట్టుపక్కల పరిశీలించగా, ఆరు ఎర్రచందనం దుంగలు లభించాయి. వారిలో ఒకరు నెల్లూరుజిల్లా, మరొకరు తమిళనాడుకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వారిని దుంగలతో సహా తిరుపతిలోని టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




# రాష్ట్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సూపర్ హిట్

**మాజీ ఎమ్మెల్సీ మాజీ టీటీడీ బోర్డు మెంబర్ గౌని వారి శ్రీనివాసులు**



**శాంతిపురం, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మ కంగా నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం శనివారం రాష్ట్రంలో సూపర్ హిట్గా నిలిచిందని మాజీ శాసన మండలి సభ్యులు, మాజీ టీటీడీ బోర్డు మెంబర్,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు సమర్థవంతంగా తగిన చర్యలు తీసుకొని అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయ వంతం చేశారన్నారు. ప్రపంచ దేశాలు ఆంధ్ర రాష్ట్రం వైపు చూసే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణంగా నిలిచిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రపంచ దేశాలలో యోగాను పాపులర్ చేయగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా 175 దేశాలలో 12 లక్షల ప్రదేశాల్లో ప్రజలు యోగ చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి విజయవంతం చేసిందని పేర్కొన్నారు. గతంలో సూరత్‌లో 1,50,000 మంది మాత్రమే యోగాలో పాల్గొన్నారని, అయితే నేడు 3 లక్షలకు పైబడి ప్రజలు యోగాలో పాల్గొని రికార్డు నెలకొల్పారని రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. రాష్ట్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతానికి నారా లోకేష్ నెల రోజులపాటు శ్రమించారని కొనియాడారు. ఈ కార్యక్రమం విజయవంతంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సైతం నారా లోకేష్‌ను ప్రత్యేకంగా అభినందించారని వివరించారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన ప్రజా సంక్షేమం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

జనం కోసమే నేటి దినపత్రిక సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్యలో చిత్తూరు జిల్లాలోని కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.
కుప్పం నియోజకవర్గం :
1. రామకుప్పం.
పలమనేరు నియోజకవర్గం :
1.గంగవరం, 2.బైరెడ్డిపల్లి

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116